క్లుప్తంగా

కేంద్ర పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



రైతులకు క్యాలెండర్‌ను అందిస్తున్న అధికారులు

సోన్: కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని టీజీబీ మేనేజర్ గుండేటి రేఖ కోరారు. మండలంలోని పాక్‌పట్ల గ్రామంలో శనివారం వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా కేంద్ర పథకాలపై అవగాహన కల్పించారు. అదే విధంగా వ్యవసాయ రంగానికి ఆర్థిక తోడ్పాటు బ్యాంకుల ద్వారా అందిస్తామని తెలిపారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను రైతులకు అందించారు. గంగారెడ్డి, భాగ్య, పురుషోత్తం, గంగాధర్, హంస, సాయిరెడ్డి, శ్రీనివాస్ రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఖానాపూర్: దస్తూరాబాద్ మండలంలో ఇటీవల విద్యుదాఘాతానికి గురై కాలు కోల్పోయిన యువకుడు నాగచైతన్యను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పరామర్శించారు. ఖానాపూర్ నుంచి ఆటోలో వెళ్తున్న యువకుడిని శనివారం రోడ్డుపై ఆపి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. నాయకులు చిన్నం సత్యం, నిమ్మల రమేశ్, షబ్బీర్ పాషా, తోట సత్యం, గంగనర్సయ్య, అమానుల్లాఖాన్, మడిగెల గంగాధర్, జంగిలి శంకర్, జహీర్ అహ్మద్, లక్ష్మీపతిగౌడ్, షౌకత్‌పాషా, ముషీర్, మీర్జా బేగ్, మేకల రాజ్‌కుమార్ ఉన్నారు.

ఇంద్రానగర్‌లో ముగ్గుల పోటీలు



ముగ్గులు వేస్తున్న మహిళలు

ఖానాపూర్: అయోధ్య రామమందిరంలో శ్రీబాలరాముని నూతన విగ్రహ ప్రాణప్రతిష్ఠ ఉత్సవాలు పురస్కరించుకుని పట్టణంలోని ఐదో వార్డు పరిధిలో ఇంద్రానగర్‌లో మహిళలకు శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో పెద్దసంఖ్యలో పాల్గొని ముగ్గులు వేశారు. పోటీల్లో గెలుపొందిన వారికి ఈనెల 22న బహుమతులు పంపిణీ చేస్తామని నిర్వాహకులు కాశవేని ప్రణయ్, కొండవేణి సంతోశ్, సోమారపు సంతోశ్, మైలారపు సాగర్ తెలిపారు.

సంక్రాంతి సంబరాలు షురూ..!



పసుపు కుంకుమ ఇచ్చుకుంటున్న ముత్తైదువులు

కుంటాల: సంక్రాంతి సందర్భంగా మండల కేంద్రంలో ముత్తైదువులు పసుపు కుంకుమ ఇచ్చుకుని శనివారం ప్రారంభించారు. ఇంటిల్లిపాది సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ పిండివంటలు చేసేటప్పుడు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్సై రాజశేఖర్

నిర్మల్‌రూరల్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఎస్సైలు రాజశేఖర్, సాయికృష్ణ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం పలు కూడళ్ల వద్ద వాహనాల తనిఖీ చేశారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలు, హెల్మెట్ ధరించని 30 మందికి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనదారుల వెంట డ్రైవింగ్ లైసెన్స్, ఇతర పత్రాలు ఉంచుకోవాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నోరూరించే గేవర్

- సంక్రాంతి వేళ ప్రత్యేక స్వీట్‌కు భలే గిరాకీ



గేవర్ విక్రయిస్తున్న దుకాణదారు

భైంసాటౌన్: సంక్రాంతి అంటే ఎవరికైనా గుర్తుకొచ్చేది పిండివంటలే..దాదాపు అందరి తెలుగిళ్లలో ఈ పండగకు సకినాలు, అప్పాలు, మురుకులు వంటివే కనిపిస్తాయి. ఇందుకుగాను వారం ముందు నుంచే మహిళలు పిండివంటల తయారీలో బిజీబిజీగా ఉంటారు. పిండి పట్టించడం, బంధువులు, పక్కింటి వారి సహాయంతో సకినాలు, అప్పాలు, మురుకులు సిద్ధం చేస్తుంటారు. అయితే భైంసా ప్రాంతంలో సంక్రాంతికి ఈ పిండి వంటలతోపాటు మిఠాయి దుకాణాల్లో లభించే గేవర్ అనే స్వీట్‌కు ప్రత్యేక స్థానం ఉంది. కొన్నేళ్లుగా ఇక్కడి ప్రాంతంలో ఈ స్వీట్ సంక్రాంతి పండుగ సందర్భంగా మాత్రమే అందుబాటులో ఉంటుంది. ఈ స్వీట్‌కు డిమాండ్ బాగానే ఉంటుంది. దీంతో దాదాపు అన్ని మిఠాయి దుకాణాల్లో గేవర్ తయారీ తప్పనిసరని నిర్వాహకులు చెబుతున్నారు.

గిరాకీ బాగుంది

మాది రాజస్థాన్. కొన్నేళ్ల కిందటే భైంసాకు వచ్చి మిఠాయి భండార్ ఏర్పాటు చేసి స్థిరపడ్డాం. మొదట్లో సంక్రాంతి పండుగకు గేవర్ స్వీట్ గురించి వినియోగదారులు అడిగేవారు. దీంతో ఈ ప్రాంతంలో ఈ స్వీట్‌కు ఉన్న డిమాండ్ తెలుసుకుని మేం తయారు చేయడం ప్రారంభించాం. సంక్రాంతి సమయంలో మాత్రమే ఈ స్వీట్‌కు గిరాకీ ఎక్కువగా ఉంటుంది.

– రవిసింగ్, మిఠాయి దుకాణం నిర్వాహకుడు, భైంసా





ప్రత్యేక రుచుల్లో..

మొదట్లో ఈ స్వీట్ మైదాపిండి, చక్కెర పానకంతో తయారు చేసి అందించేవారు. క్రమంగా ఈ స్వీట్‌కు ఆదరణ పెరగడంతో ప్రస్తుతం వివిధ రుచుల్లో అందుబాటులో ఉంచుతున్నారు. నెయ్యితో చేసినవి, మలాయితో చేసినవి, డ్రైఫ్రూట్‌తో చేసినవి ఆకట్టుకునే ఆకృతుల్లో తయారు చేసినవి అందిస్తున్నారు. కిలో రూ.300 మొదలు రూ.800 వరకు వివిధ రుచుల్లో అందుబాటులో ఉన్నాయి.

క్రీడల్లో గెలుపోటములు సహజం



క్రికెట్ ఆడుతున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఖానాపూర్: క్రీడల్లో గెలుపోటములు సహజమని, ప్రతిఒక్కరూ క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం ఖానాపూర్ క్రికెట్ ప్రీమియర్ లీగ్–2024, సీజన్–2 పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందన్నారు. తాను షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడని తెలిపారు. క్రీడాకారులు ఆటల్లో రాణించి జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో సత్తాచాటాలన్నారు. యువకులు, విద్యార్థులకు తనవంతుగా అన్నివిధాల ప్రోత్సాహం అందిస్తానని తెలిపారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని కాసేపు బ్యాటింగ్ చేశారు. ఈ పోటీలకు ప్రధాన స్పాన్సర్‌గా ఎన్ఆర్ఐ పరికిపండ్ల ప్రశాంత్ వ్యవహరిస్తున్నారు. కార్యక్రమంలో నాయకులు కూచాడి శ్రీహరిరావు, భుక్య జాన్సన్‌నాయక్, అంకం రాజేందర్, అబ్దుల్ కలీల్, చిన్నం సత్యం, రాపెల్లి రాజు, కొరండ్ల సుధీర్, విపిన్ పాల్గొన్నారు.



పచ్చని తివాచీ పరిచినట్లు..

కుంటాల: ఎటుచూసినా పచ్చని తివాచీ పరిచినట్లు కనినిపిస్తున్నది మండలంలోని వెంకూర్ శివారుప్రాంతంలో ఆవ పంట. పూత దశలో ఉన్న బ్రాసికేసి కుటుంబానికి చెందిన ఆవ(బ్రాసికా నైగ్రా) వంటింటి పోపు దినుసుగా, ఆయుర్వేద, పచ్చళ్ల తయారీలో విరివిగా వినియోగిస్తున్నారు. రైతులు విలాస్‌రావు, గజానన్‌రావులు ఈ పంట సాగు చేస్తున్నారు.

అయోధ్య అక్షింతలు పంపిణీ



పంచగుడిలో అక్షింతలు పంపిణీ చేస్తున్న భక్తులు



రాచాపూర్‌లో ఊరేగింపులో పాల్గొన్న మహిళలు



తానూరు మండలం ఎల్వి గ్రామంలో ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



ఖానాపూర్: ఎర్వచింతల్‌లో మంగళహారతులతో పాల్గొన్న మహిళలు

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి గ్రామంలో శనివారం అయోధ్య అక్షింతలను హనుమాన్ మందిరం నుంచి గ్రామ ప్రధానవీదుల గుండా మహిళలు మంగళహారతులతో ఊరేగించారు. అనంతరం హనుమాన్ మందిరంలో పూజలు చేశారు. తర్వాత ఇంటింటికీ అక్షింతలను పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ ఆనంద్‌రావు, గ్రామస్తులు గంజాల గంగాధర్, మిషిన్ నారాయణ్, సాగర్‌గౌడ్, రాజు, రాంగోపాల్, గంగాధర్, శ్రీనివాస్, గజ్జారాం, ప్రవీణ్‌దాద, కామన్న, యోగేష్, శంకర్, హోటర్ రాజు ఉన్నారు.

తానూరు: మండలంలోని ఎల్వి గ్రామంలో అయోధ్య అక్షింతలను కార్యకర్తలు ఇంటింటికీ పంపిణీ చేశారు. ముందుగా అక్షింతలు, శ్రీరాముని చిత్రపటంతో ఆయా వీధుల్లో ఉరేగింపు నిర్వహించారు. నాయకులు చిన్నారెడ్డి, మోహన్‌రెడ్డి, భజన మండలి భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఖానాపూర్: మండలంలోని ఎర్వచింతల్‌లో శనివారం అయోధ్య రాముని అక్షింతల శోభాయాత్ర సాగింది. మహిళలు మంగళహారతులతో ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం బీజేపీ నాయకులతోపాటు గ్రామస్తులు ఇంటింటికీ వెళ్లి అక్షింతలు పంపిణీ చేశారు. పట్టణంలోని 12వ వార్డు పరిధిలో గల కుమురం భీం చౌరస్తాలోని డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద హిందూ ఉత్సవసమితి ఆధ్వర్యంలో అక్షింతలు పంపిణీ చేశారు. నాయకులు సురేష్, రాజశేఖర్, గంగామణి, రవీందర్, రాజు, మొగిలి, వెంకటేశ్ ఉన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్, బాబాపూర్, న్యూకంజర్ గ్రామాల్లో అయోధ్య అక్షింతలను ఆలయాల నుంచి ఊరేగింపు వెళ్లారు. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఇంటింటికీ అక్షింతలను పంపిణీ చేశారు. న్యూ కంజర్ వీడీసీ సభ్యులు మోహన్‌రెడ్డి, రాచాపూర్ మాజీ సర్పంచ్ పోశెట్టి, మాజీ ఎంపీటీసీ పోశెట్టి, వీడీసీ సభ్యులు నారాయణ, ముత్యం, ముజ్జిగా నవీన్, శాతం గంగారాం, గుడిసె శేఖర్, మధు, దినేష్, శేఖర్, రాము పాల్గొన్నారు.

ఇంకుడు గుంతల బిల్లులేవి?

- ఉపాధిహామీ కింద అందని ప్రోత్సాహకం
- కుభీర్ మండలంలో నిర్మాణాలు పూర్తయినా.. అందని డబ్బులు
- అధికారులు పట్టించుకోవాలని లబ్ధిదారుల వేడుకోలు



కుభీర్ ఎస్సీ హాస్టల్‌లో నిర్మించిన ఇంకుడు గుంత

కుభీర్: వర్షపునీటిని ఒడిసిపట్టి.. అడుగంటుతున్న భూగర్భజలాలను పెంచేందుకు ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద ఇంకుడుగుంతల నిర్మాణాలకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇప్పటికే గ్రామాలు, పట్టణాల్లో తప్పనిసరిగా ఇంటికో ఇంకుడుగుంత నిర్మించాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. జాబ్‌కార్డు కల్గిన వ్యక్తి ఇంకుడుగుంత నిర్మించుకునేందుకు అర్హులు. తమ ఇంటి వద్ద ఇంకుడు గుంత నిర్మించినట్లు ఫొటోలు, ఇతర ఆధారాలు సంబంధిత అధికారులకు అందిస్తే ప్రోత్సాహక బిల్లులు విడుదల చేస్తారు.

కుభీర్ మండలంలో..

కుభీర్ మండలంలో 41 గ్రామపంచాయతీలున్నాయి. ఆయా గ్రామాల్లో 613 ఇంకుడుగుంతలు ఇళ్లల్లో నిర్మించుకోగా.. 136 సామాజిక ఇంకుడు గుంతలు నిర్మించారు. గతేడాది వేసవిలో నిర్మించుకున్న ఇంకుడుగుంతల నిర్మాణాలకు బిల్లులు రాలేదు. ఇప్పటివరకు ఒక్క విడత కూడా బిల్లులు ఇవ్వలేదని మండలవ్యాప్తంగా సుమారు రూ.50 లక్షల వరకు పెండింగ్‌లో ఉన్నట్లు ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. అధికారులు అవగాహన కల్పిస్తే అప్పులు చేసి ఇంకుడుగుంత నిర్మించుకున్నామని.. వెంటనే బిల్లులు విడుదల చేయాలని వేడుకుంటున్నారు. మరోవైపు సామాజిక ఇంకుడు గుంతలను కొన్నిచోట్ల సర్పంచ్‌లు నిర్మించగా.. మరికొన్ని చోట్ల ఉపాధి సిబ్బందే వాటిని నిర్మించారు.



దార్‌కుభీర్ పాఠశాలలో అసంపూర్తిగా ఇంకుడు గుంత

నిబంధనలివీ..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉపాధిహామీ పథకం కింద జాబ్‌కార్డు ఉన్న వ్యక్తి ఇంటి వద్ద నిర్మించుకున్న ఇంకుడుగుంతకు రూ.6150 చెల్లిస్తారు. ప్రతి గ్రామంలో ఐదు సామాజిక ఇంకుడుగంత నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. ప్రభుత్వ కార్యాలయాలు, మురుగు కాల్వల పక్కన నిర్మించే సామాజిక ఇంకుడుగుంత నిర్మాణానికి రూ.12 వేల వరకు కాంట్రాక్టర్‌కు చెల్లిస్తారు. ఇంటి వద్ద ఉండే ఇంకుడుగుంత ఒకటిన్నర మీటర్ల లోతు, రెండున్నర మీటర్ల వెడల్పు లేదా రెండు మీటర్ల లోతు, మూడు మీటర్ల వెడల్పు ఉండేలా నిబంధనలు రూపొందించారు.

నాసిరకంగా నిర్మాణాలు..

మండలంలోని పలు గ్రామాల్లో సామాజిక ఇంకుడు గుంతలను నాసిరకంగా నిర్మించారు. దీంతో ఏడాది కాకముందే శిథిలావస్థకు చేరుతున్నాయి. కుభీర్‌లోని ఎస్సీ హాస్టల్‌లో నిర్మించిన ఇంకుడుగుంతలో అమర్చిన పైపులు పగిలిపోయాయి. ఇప్పటికైనా అధికారులు క్షేత్ర పరిశీలన చేసి సామాజిక ఇంకుడుగుంతలు దెబ్బతినకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నాణ్యతతో నిర్మించాలి



ప్రభుత్వం సామాజిక ఇంకుడు గుంతలను నాణ్యతతో నిర్మించాలి. బిల్లులు సైతం సక్రమంగా చెలించాలి. కొన్ని ఇంకుడు గుంతలు ఇప్పుడే దెబ్బతింటున్నాయి. ప్రజాధనం వృథా కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– నార పరశురాం, కుభీర్

బిల్లులు చెల్లించాలి



అధికారులు అవగాహన కల్పించడంతో ఇంటి వద్ద ఇంకుడుగుంత నిర్మించుకున్నా. కానీ నెలలు గడుస్తున్నా.. బిల్లులు మాత్రం రావడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇంకుడుగుంతలు నిర్మించుకున్నందుకు బిల్లులు చెల్లించాలి.

– చవాన్ లక్ష్మణ్, బెల్గాంతండా

నివేదించాం

ఉన్నతాధికారుల ఒత్తిడితో నిర్మించాం. కొన్ని గ్రామాల్లో సర్పంచులు ముందుకు రాకపోతే సామాజిక ఇంకుడుగుంతలు నిర్మించాం. మండలవ్యాప్తంగా ఇంకుడుగుంతలకు సంబంధించి సుమారు రూ.50లక్షల వరకు రావాలి. ఈ విషయమై ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదించాం. బిల్లులు రాగానే గ్రామస్తులకు అందిస్తాం.

– హరిలాల్, ఏపీవో, కుభీర్

ఘనంగా గోదారంగనాథుల కల్యాణం



న్యూవెల్మల్‌లో శ్రీలక్ష్మీ వేంకటేశ్వర ఆలయంలో కల్యాణంలో పాల్గొన్న భక్తులు

ఖానాపూర్: ధనుర్మాసవ్రత మహోత్సవంలో భాగంగా పట్టణంలోని శ్రీగోదాదేవిరంగనాథుల కల్యాణాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు చక్రపాణి వాసుదేవాచార్యులు, నర్సింహమూర్తి ఆధ్వర్యంలో కల్యాణాన్ని జరిపించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతోపాటు బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ హాజరై పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఆలయకమిటీ అధ్యక్షుడు అడ్డగట్ల రాజన్న, నిమ్మల రమేశ్, ఉషకోల సుధాకర్, డా. కిరణ్‌కుమార్, వొడ్డెపల్లి కృష్ణంరాజు, రాము పాల్గొన్నారు.



ఖానాపూర్: కల్యాణ తంతు జరిపిస్తున్న పండితులు

సోన్: మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం గోదాదేవి కళ్యాణ మహోత్సవం కనులపండువగా జరిగింది. ఈ మహోత్సవంలో ఎదురుకోళ్లు, అప్పగింతల కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం అన్నదానం నిర్వహించారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

నిరంతర సాధనతోనే మెరుగైన ప్రదర్శన

నేరడిగొండ: నిరంతర సాధనతోనే మెరుగైన ప్రదర్శన కనబర్చవచ్చని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం జిల్లా సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. శారీరక దారుఢ్యంతో పాటు స్నేహభావం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ సజన్, సర్పంచ్ పెంట వెంకట రమణ, ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, ఎంపీటీసీ పండరి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నానక్ సింగ్, వీడీసీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, సద్దాం, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

నేరడిగొండ: మండల కేంద్రానికి చెందిన ఏలేటి అశ్విన్ రెడ్డి నానమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శనివారం వారి నివాసానికి చేరుకొని కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

తాంసి: భీంపూర్ మండలంలోని నిపాని వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. 17వ వార్షికోత్సవంలో భాగంగా ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మొదటి రోజు ఆలయ వ్యవస్థాపకుడు శ్రీ శివదత్తగిరి మహరాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, నవగ్రహ పూజ, అర్చన, హోమం, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి అధ్యక్షుడు అనిల్, గ్రామపెద్ద గంగాధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చామన్‌పెల్లిలో క్రీడాపోటీలు

లక్ష్మణచాంద: సంక్రాంతి పండుగ పురస్కరించుకొని మండలంలోని చామన్‌పెల్లి గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి ఎస్‌టీ రాజేశ్వర్ తన గ్రామంలో మండల స్థాయి క్రీడాపోటీలను ప్రారంభించారు. ఇందులో కబడ్డీ, వాలీబాల్, టెన్నికాయిట్ తదితర పోటీలు రెండు రోజులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువకులు ఆటల్లో ప్రోత్సహించేందుకు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందిస్తామన్నారు. ఎస్‌టీ నిహాంత్, సురేష్, శ్రీనివాస్, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు గోదారంగనాథుల కల్యాణం

కుంటాల: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా కుంటాల ప్రాచీన శ్రీకృష్ణ దేవాలయంలో ఆదివారం ఉదయం 11 గంటలకు గోదా రంగనాథుల స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు.